
# యజ్ఞోపవీతం

డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి

'**అ**శోకుడు బాటపక్కన చెట్లు నాటించాడు'అన్న చరిత్ర పాఠం చిన్నతనాన మనస్సులో బాగా ముద్రితమైంది. ఏ రోడ్డుపక్కన చెట్లను చూస్తున్నా అశోకుడు నాటించినవే అని నాకు బాగా ఊహ తెలిసేదాకా అనుకొనేవాణ్ణి.

మిత్రుడి చావు కబురు తెలిసి విజయవాడ బయల్దేర వలసి రావడంతో మధ్యాహ్నా ప్రయాణం తప్పలేదు. ప్రయాణం వేసవి తాపాన్ని చూపిస్తున్నా రోడ్డుకిరువైపులా వున్న వృక్ష సముదాయం గుబురుగా సౌహార్ధంగా కొమ్మల చేతులతో గాలిని హాయిగా అందిస్తున్నట్లుంది. మధ్యాహ్నాం గడిచేకొద్దీ ఎండతాపం అధికమయింది.

చనిపోయిన మిత్రుడి జీవితం తెగిన గాలి పటమైంది. క్రమశిక్షణ లేదు. మొదటి నుంచి విప్లవభావాలుగల అతని జీవితం అర్థాంతరంగా ముగిసింది. చదువుకునే రోజుల్లో తనవారిని ఎవరేమన్నా అంటే తగాదాలు, వాగ్వివాదాలు లేకుండా చితక బాదేవాడు. తనకి పెంచుకున్న కూతురు తప్పితే ఎవరూ లేరు. మా కుటుంబ విషయాల్లో చాలా సహాయంగా వుండేవాడు. చివరి చూపులకు బయల్దేరాను.



సూర్యాపేట వచ్చింది. 'అర్థ గంట టైం వుంటుంది భోజనాలు పూర్తి చేసుకోండి'-కండక్టర్ కేకతో ఒక్కొక్కరు బస్సు దిగుతున్నారు. విండో పక్క సీటు కావడంతో నెమ్మదిగా దిగుదామని బస్‌స్టేషన్‌లోని జనాల్ని చూస్తుంటే ఒక వ్యక్తి నన్నాకర్షించారు. బక్క పలుచగా, నడుము కొద్దిగా వంగి, తెల్లటి గుబురు గడ్డం జుత్తుతో, నుదిటినిండా విభూతి, చేతిలో ఏవో దారపు వత్తులతో ఒక్కొక్కరి దగ్గరకు జరిగి ఏదో వారితో మాట్లాడుతున్నారు. కొందరు పట్టించుకోవడం లేదు. కొందరయితే బిచ్చగాడిని ఈసడించుకొన్నట్లు జరగడం చూసి నాకు ఆసక్తి మొదలయింది.

ఆయనను చూసినప్పటి నుండి ఎందుకో గాని నా శరీరంలోని అన్ని అవయవాలు ఒక్కసారిగా తమ చలనత్వం చూపాయి. లేచి బస్సు దిగాను.

ఆయనకు దూరంగానే వుండి చూశాను.

'రాఘవయ్య పంతులు!'

నా చిన్ననాటి టీచరు. నా జీవితంపై ఎంతోకొంత తన ప్రభావం వుంది. రాఘవయ్య పంతులు వ్యక్తిత్వం జీవన సరళి ప్రత్యేకంగా వుండేది. సాటి టీచర్లకు చాలా భిన్నంగా వుండేవారు. టీచరు ఉద్యోగం కమిటీ స్కూలులో ఎప్పుడో మూడు, నాలుగు నెలలకు ఒక్కసారి, అదీ ఒక్క నెలకు జీతం ఇచ్చేవారు. ఆర్థిక ఒత్తిడులు, కుటుంబ ఖర్చులు ఎక్కువ. అయినా చాలా ప్రశాంతంగా, గంభీరంగా వుండేవారు.

రాఘవయ్య పంతులు గారింట్లో పిల్లలకు ట్యూషన్ అంటే అందరికీ ఇష్టమే. పిల్లలకు అర్థమయ్యేలా చాకచక్యంగా చెప్తారని సంపన్నులు, నెలవారీ ఫీజులు అడగడనీ, ఇచ్చింది పుచ్చుకుంటాడనీ మధ్యతరగతివారు, ఏవో నాలుగు అక్షరం ముక్కలు వస్తాయని పేదవర్గాలవారు వారివారి అంచనాలతో తమ పిల్లల్ని పంపేవారు. అందరి పట్ల సమభావం వుండేది ఆయనకు. అందరి దీపాలతో పంతులుగారి యిల్లు దీపాల పండుగలా వుండేది. కరెంటు లేని రోజులు. బెల్జియం లాంతరు, కోడిగుడ్డు దీపం, కిరసనాయిలు బుడ్డి దీపాలు, ఎవరి స్థాయిని బట్టి వారు తెచ్చుకునేవారు. చదవటం విసుగేసినప్పుడు, ఆకతాయితనంతో ఒకరి దీపాలు ఒకరు తెలీకుండా ఆర్పేయడం, వొత్తి లోపలికి నెట్టి లాంతరు రిపేరు వంకతో, సహాయం మిషతో చుట్టూ చేరడం వెనులుబాటు.

మధ్యమధ్యలో పంతులుగారు పిల్లల మధ్యలో పచార్లు చేస్తుండేవారు. ఎవరైనా కునికిపాట్లు పడుతున్నప్పుడు పక్కవారి ముందు పరచిన పుస్తకాల్ని మడిచివుంచడం, పుస్తకాలు లేకుండా తూగుతూ నిద్రలో చదివే పక్కవారిని చివాట్లు పెడితే సంతోషించడం చిన్ననాటి సరదాలు. ఆయనకు ఆరుగురు పిల్లలు, ఎవరూ మాతో కూర్చొని చదివేవారు కాదు. ఇంట్లో పనిచేసుకుంటూ వుండేవారు. అయినా ఎప్పుడు చదివేవారో కానీ పరీక్షలలో మంచి మార్కులు వచ్చేవి. క్రమశిక్షణతో వుండేవారు.

ప్రతి శనివారం భజన కార్యక్రమం వుండేది. ఆ రోజు చదువులకు ఆట విడుపు, భజన కీర్తనలు మొత్తం వారి పూర్వీకులు రాసినవే పాడేవారు. చాలా మనోహరంగా వుండేవి. ఆ రోజు వీలునుబట్టి ప్రసాదాలు అమిరేవి. పిల్లల్ని ఎవరినీ ఏమీ తేనిచ్చేవారు కాదు. ఏమీ లేకపోతే కేవలం పంచదార నైవేద్యంతోనే సరిపెట్టుకోవలసి వచ్చేది. పిల్లలు ట్యూషన్‌కు రాకపోతే వారి ఇంటికి వెళ్ళి కారణం కనుక్కొని వచ్చేవారు. ఆరోగ్యం బాగాలేకపోతే ఏవో కషాయం దినుసులు చెప్పేవారు. దానివల్ల తల్లిదండ్రులకు జాగ్రత్త వుండేది. కనిపించని క్రమశిక్షణ వుండేది అందరిలో.

ఖద్దరు బట్టలనే ధరించేవారు. గాంధీగారిని రైల్వేస్టేషనులో ఒకసారి చూసిన దగ్గర నుండి ఆ సన్నివేశం గుర్తు గా ఖద్దరుధారణ నిర్ణయం తీసుకున్నారట.

ఆయన నన్ను గమనించకుండా జాగ్రత్తపడి ఆయన ఏమి చేస్తున్నారో గమనించాను. కొంచెం ఆధునిక వేషధారణలో వున్నవారి దగ్గరకు జరిగి చేతిలోని జంధ్యాలను చూపిస్తూ "బాబూ యజ్ఞోపవీతం కావాల్నా?" అని అడుగుతున్నారు. నేను ఎదురుగా వెళ్ళి నిల్చున్నాను.

"కావాల్నా?" అని చేయి ముందుకు చాపి అడిగారు.

శబ్దించిన మాటలు నా మనస్సు నిండా ముసిరాయి.

పురాతన కుడ్యం ముందు నిలువునీడల్లా మేమిద్దరం మనసు పొరల్లోంచి మాటలు సుడులుసుడులుగా తిరిగి-

"మాస్టారూ! నేను రాముణ్ణి" అన గలిగాను.

ఒకక్షణం సాలోచనగా తలపైకెత్తి- "ఒరే రాముడూ! నువ్వట్రా బాగున్నావా?మంచి పొజిషన్‌లో వున్నావటగా?" అంటూ మిగతా స్నేహితుల గురించి పేరుపేరునా అడిగారు, తెలిసిన వారి గురించి చెప్పాను.

"మాస్టారు ఏమిటిది?"

"స్వధర్మ ప్రభోదం!"

"అదిగాదు మాస్టారు, మీ స్థితి గురించి!"

"స్థితికేమిరా, అంతా సవ్యంగానే వుంది. ఇంతకుముందు జీతాలే సరిగాలేవు, ఇప్పుడు పుష్కలంగా పెన్షను వస్తోంది" అని చిన్నగా నవ్వారు.

పురాతన చైతన్య పరిమళం జ్ఞాపకాల నుంచి వస్తోంది.

"పిల్లలందరూ సెటిల్ అయ్యారు. పెద్దవాడు ఇక్కడే బాంక్ మానేజర్, చిన్నవాడు అమెరికాలో, ఆడపిల్లలు ఎవరి వూళ్ళలో వారు.నేను ఈ వ్యాపకంలో గడిపేస్తున్నాను."

మేథో సంపర్కంలో మనిషి తన జీవితపు విలువలు మెరుగు పరుచుకొనేందుకు అనేకానేక ప్రయోగాల్ని, ప్రణాళికల్ని కాలానుగుణంగా మలుచుకుంటూ వున్నా, ఇప్పటికీ పూర్తి మానవీయతను పొందలేకపోతున్నాడు. ఏం కావాల్నో తెలుసుకోలేక సతమతమౌతున్నాడు.

మనిషికి కావాల్సింది ఏమిటి? సరైన సమాధానం రాని ప్రశ్న నాకు. ఎవరిని అడిగినా 'తృప్తి, సంతోషం, సుఖం, డబ్బు, ఆరోగ్యం' వారివారి ఆలోచనల్ని బట్టి సమాధానం చెప్పేవారు.

'అసంతృప్తిగానే వుంది. తృప్తిపడితే ఈ ప్రగతి, అభ్యుదయం జరిగేవా? ఇంత ప్రగతిలో తృప్తి లేదేమిటి? డబ్బుతో అన్నీ సమకూరుతున్నాయా?' సమాధానం లేదు.

క్షణాలు, నిముషాలు, గంటలు, రోజులు దొర్లిపోతున్నాయి. స్పీడ్‌గా, ఇంకాఇంకా స్పీడ్‌గా, ఆలోచనలు గూడా అందుకోలేకపోతున్నాయి. జీవితాలు ఎండిపోయిన కొయ్య బతుకులు అయినాయి, నిస్సారమైనాయి.

యాంత్రిక స్వరూపం దాల్చుతున్న ప్రపంచంలో ప్రేమ, యౌవనం, ఆనందానుభవాలు, సంగీత పరిమళాలు అర్థాలను మార్చుకుంటున్నాయి. ఆర్థిక స్వామ్యం చుట్టూ తిరిగే జీవితమంటే అసహనం మొదటినుంచీ నాకు. అయినా దరిద్రం అంటే ఎందుకో మనసు ఒప్పుకోదు. దరిద్రంలో యాచక సోమరితనం రెండూ కలిసివుంటాయి. ఆత్మాభిమానం వున్నవారికి దరిద్రం వుండదు. అదే ఆత్మాభిమానంతో ఎప్పుడూ మాస్టారు తొణికిసలాడేవారు. ధనలేమి వుండేదేమో కాని భయం, ఆకలి లేమితనం వుండేవికావు. అదే నాకు స్ఫూర్తి.

'రాఘవయ్య పంతులు ప్రశాంతతకు కారణం ఏమై వుంటుంది? ఎదుగుదల చాలు అని తృప్తిపడ్డారా? ప్రశాంతంగా ఎలా వున్నారు! మరి ఈ వ్యాపకం ఏమిటి? అందరిలా ఎందుకు వుండరు! ఈ వయస్సులో ఇంత విలక్షణంగా ఎలా వున్నారు?'

అదే అడిగాను.

స్వచ్ఛంగా తెల్లగా నవ్వారు.

"జాతి మనుగడకు క్రమశిక్షణ అవసరం. స్వధర్మం అవసరం. ఒక తరం క్రమశిక్షణతో మెలిగితే మరోతరం సుశిక్షితంగా దృఢతరం అవుతుంది. జాతి కోల్పోయిన నైతిక విలువలు తిరిగి పొందటం అవసరం. మనోధైర్యం పెరిగి తీరాలి.మనోవైకల్యంతో మధుమేహ జరా వ్యాధులు జాతిని కబళిస్తున్నాయి.

జ్యోతిర్మయ స్వరూపమైన స్వాధ్యాయ ప్రవచనమే స్వధర్మం. ఇదే నా దీక్ష. ఇదిగో ఈ యజ్ఞోపవీతం క్రమశిక్షణాయుత దీక్షకు సంకేతం.

ఆర్థిక అవసరాలను గమనించింది నేటి యువతరం. అదే తీరులో స్వధర్మ క్రమశిక్షణ అవసరం. ఆచరించాలి.

'తపస్స్వాధ్యాయ నిరతం" అంటూ రామాయణ ప్రవచనాన్ని చెప్తూ తలనిమిరారు.

నాకు మాత్రం కావ్యకంఠ గణపతి ముని మరలా అవతరించారనిపించింది. ఉద్వేగభరిత ప్రవచనానికి అందరూ ఆయనకు నమస్కరించారు.

నా అన్న ప్రశ్నలకు సమాధానం దొరికినట్లయింది.

నేను యజ్ఞోపవీతాన్ని తీసుకొన్నాను.

అందరూ ఎగబడి తీసుకొన్నారు. ఆయన కళ్ళు మరింత కాంతివంతంగా మెరిశాయి.